క్లుప్తంగా

24 నుంచి ఏయూలో అంతర్జాతీయ సదస్సు



అంతర్జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా తత్వశాస్త్ర, రిలీజియస్ స్టడీస్ ఆధ్వర్యంలో ఎక్స్‌పోప్లరింగ్ ది ఫిలసాఫికల్ లెగసీ ఆఫ్ ప్రొఫెసర్ కె.సచ్చిదానందమూర్తి అంశంపై అంతర్జాతీయ సదస్సు సెప్టెంబరు 24 నుంచి 26 వరకు నిర్వహించనున్నారు. ఈ సదస్సును ప్రొఫెసర్ కె.సచ్చిదానంద మూర్తి శత జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ తన కార్యాలయంలో మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు, తత్వశాస్త్ర శాఖాధిపతి ప్రొఫెసర్ కె.రమేష్ బాబు, ప్రొఫెసర్ ఎం.వి.కృష్ణయ్య, వై.వి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 27 నుంచి ఎఫ్‌డీపీ

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్ర విభాగంలో అక్టోబర్ 27 నుంచి 31 వరకు ఐదు రోజులపాటు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) నిర్వహించనున్నట్లు ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమానికి సంధించిన బ్రోచర్‌ను తన కార్యాలయంలో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు, పర్యావరణ శాస్త్ర విభాగం గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఎంపవరింగ్ ఎన్విరాన్మెంటల్ స్టీవార్డ్‌షిప్ అంశంపై నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, పర్యావరణ శాస్త్ర విభాగాధిపతి ఆచార్య పి.సుభాషిని దేవి, బీవోఎస్ చైర్మన్ ఆచార్య కె.వీరభద్రం, విభాగ విశ్రాంత ఆచార్యులు ఎ.జె.సాల్మన్ రాజు, ఆచార్య బి.హిమ శైలజ, ఆచార్య డి.విజయ్ కుమార్, సీహెచ్‌వీ రమణ పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న గురుకులం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ఆరిలోవ : రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో శ్రీకృష్ణాపురం గురుకులం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్ – 12 విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ పొందారు. ఈ నెల 13, 14న కర్నూలులో జరిగిన టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి సోమవారం గురుకులానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విజేతలను గురుకులంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. వారిలో ఇక్కడ ఏడో తరగతి చదువుతున్న రేవంత్ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. జాతీయ స్థాయి మినీ సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ టోర్నమెంట్ హైదరాబాద్‌లో త్వరలో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీడీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చేయండి

బీచ్‌రోడ్డు : అభివృద్ధి మొత్తం అమరావతిలోనే కేంద్రీకృతం చేస్తే మళ్లీ ప్రాంతాల మధ్య అసమానతలు తలెత్తుతాయని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రియాంక దండి అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఇప్పటికే రాజధాని నిర్మాణం కోసం 33 వేల ఎకరాలు సేకరించారని... అది అభివృద్ధి చేయడానికే 25 సంవత్సరాలు పట్టవచ్చని, ఇంకా రాజధాని ప్రాంతం విస్తరించాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలోని ప్రతీ జిల్లాను ఒక్కో హబ్‌గా అభివృద్ధి చేయాలని కోరారు. ఉత్తరాంధ్ర, రాయలసీమను అభివృద్ధి చేసేలా సీఎం చంద్రబాబును డిప్యూటీ సీఎం పవన్ ఒప్పించాలని సూచించారు.

డీజిల్ లోకో షెడ్‌లో తనిఖీలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్‌బోహ్రా మంగళవారం డీజిల్ లోకో షెడ్‌లో పర్యటించారు. గత ఆరు నెలల్లో లోకో షెడ్ పనితీరు, సామర్థ్యం, జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. సరకు రవాణా, లోడింగ్ సామర్థ్యం పెంపుదల వంటి కీలక విషయాలపై సమీక్షించారు. ఈ పర్యటనలో సీనియర్ డివిజినల్ మెకానికల్ ఇంజినీర్ (డీజిల్) ఎంకే సాహూ, సీనియర్ డివిజినల్ ఫైనాన్స్ మేనేజర్ ఎం.హరనాథ్, సూపర్‌వైజర్లు, ప్లానింగ్, ప్రాజెక్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.



అనధికారిక అంతస్తులతో జంట భవనాలు



దారపాలెం అమ్మవారి గుడి ఎదురుగా అనధికారిక అంతస్తుతో నిర్మాణం



దారపాలెంలో దేవస్థానం కొండ వైపు అనధికారిక అంతస్తుతో నిర్మాణం

పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు



దారపాలెంలో సుమారు 50 చదరపు గజాల స్థలంలో నిర్మించిన ఐదంతస్తుల భవనం

- జీవీఎంసీ 13వ వార్డు దారపాలెంలో అంతా ఇష్టారాజ్యం
- అనుమతులు లేకుండా అదనపు అంతస్తుల నిర్మాణం
- గెడ్డ భాగం చదును చేసేసి భవనాలు నిర్మించేస్తున్న అక్రమార్కులు
- నిబంధనలకు విరుద్ధంగా ప్లాన్ ఇచ్చేస్తున్న టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు
- ఎమ్మెల్యే పేరు చెప్పి చక్రం తిప్పుతున్న టీడీపీ నాయకులు

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి దారపాలెంలో పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. అనుమతులు తీసుకోకుండా అనధికారిక అంతస్తులు నిర్మించేస్తున్నారు. ఈ ప్రాంతమంతా స్థలాల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలకు నిలయంగా మారిపోయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ చేపడుతున్న అక్రమ నిర్మాణాల్లో రాజకీయ నాయకుల జోక్యం ఎక్కువగా కనిపిస్తోంది. ముఖ్యంగా టీడీపీ నాయకులు అండగా నిలుస్తుండడంతో అక్రమార్కులకు అడ్డు అదుపు లేకుండా పోతుందన్న ఆరోపణలు స్థానికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడి రెవెన్యూ స్థలాల ఆక్రమణతోపాటు అనధికారిక నిర్మాణాలతో ఈ ప్రాంతం నిత్యం వార్తల్లో నిలుస్తోంది. తరచూ రెవెన్యూ స్థలాలు ఆక్రమణలలో దిట్టయిన ఓ స్థానికుడిపై ఇటీవల ఆరిలోవ పోలీసులు రౌడీషీట్ సైతం తెరిచారు. దీన్ని బట్టి ఇక్కడ ఏ స్థాయిలో అక్రమాలు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. అయినా సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో బాధ్యతతో వ్యవహరించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఇక్కడ ఆక్రమణల వ్యవహారం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో రూరల్ మండలం అధికారులు తూతూమంత్రపు చర్యలు చేపట్టారు. ఈ ప్రాంతంలో రెవెన్యూ విభాగానికి చెందిన 34 ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించి ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులలో కొన్నింటిని ఆక్రమణదారులు ఇప్పటికే తొలగించేయడం విశేషం.

గెడ్డ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు

ఇదే ప్రాంతంలో 18, 19 సర్వే నంబర్లలో గెడ్డ స్థలాలను సైతం కొందరు వ్యక్తులు వదలలేదు. ఇక్కడ రెవెన్యూ విభాగానికి చెందిన గతంలో ఉన్న గెడ్డ స్థలాన్ని ఆక్రమించి కొందరు నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడం విశేషం. ఇదిలా ఉండగా జోన్ – 2 టౌన్ ప్లానింగ్ అధికారులు అనధికారిక అంతస్తులను చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వారు ఇచ్చిన ప్లాన్‌ను అతిక్రమించి అదనంగా అంతస్తులు నిర్మిస్తున్నా పట్టించుకోకపోవడంతో పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ అక్రమ నిర్మాణాల్లో స్థానిక ఎమ్మెల్యే పేరు చెప్పి ఆరిలోవ, దారపాలెం, శ్రీకృష్ణాపురానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు, రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంతోపాటు ప్రభుత్వ, గెడ్డ స్థలాల్లో నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అనధికారికంగా బహుళ అంతస్తుల నిర్మాణం



పాత గ్రామంలో బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని చెరువు వైపు అనధికారిక అంతస్తు కోసం సిద్ధం చేస్తున్న డకింగ్

దారపాలెంలో బీఆర్‌టీఎస్‌కు రెండు వైపులా విచ్చలవిడిగా అనధికారిక నిర్మాణాలు జరుగుతున్నాయి. దేవస్థానం కొండ వైపు బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని చిన్న స్థలంలో నిర్మించిన భవనానికి అనధికారికంగా అదనపు అంతస్తు వేసేశారు. దానికి ఎదురుగా పాత గ్రామంలో బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని టౌన్ ప్లానింగ్ అధికారులు నుంచి ఐదు ఫ్లోర్ల నిర్మాణానికి అనుమతి తీసుకుని అనధికారికంగా ఆరో ఫ్లోర్ నిర్మించేస్తున్నారు. దీని కోసం డకింగ్ పనులు చేపట్టేశారు. ఇక్కడి చెరువు గట్టును ఆనుకుని అమ్మవారి గుడి ఎదురుగా చిన్న స్థలంలో మరో వ్యక్తి డేరాలు కప్పి అనధికారిక అంతస్తు నిర్మించేశాడు. దీనికి సమీపంలో మరో వ్యక్తి సుమారు 150 చదరపు గజాల స్థలంలో ఐదు ఫ్లోర్ల భవనం నిర్మించేశాడు. స్థలం విస్తీర్ణం బట్టి మూడు ఫ్లోర్ల కంటే ఎక్కువ అంతస్తుల నిర్మాణానికి అనుమతి ఇవ్వకూడదు. **అయినప్పటికీ ఇక్కడ** ఐదు ఫ్లోర్లు నిర్మించేశాడు. **దీనికి సమీపంలో మరో** వ్యక్తి అధికారుల నుంచి **అనుమతి తీసుకున్నదా**నికంటే అదనంగా రెండు ఫ్లోర్లు వేసేశాడు. ఇక్కడ ఆ భవనం పక్కనే మరో వ్యక్తి ఇదే మాదిరిగా అక్రమ అంతస్తులు నిర్మించేశాడు. ఈ రెండు అక్రమ నిర్మాణాలు చూసే వారికి జంట భవనాలుగా కనిపిస్తున్నాయి.



గెడ్డ స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్న భవనం

ఆరోగ్యశ్రీని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం

- నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు చెల్లించక పేదలకు వైద్యం దూరం
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



జీవీఎంసీ 12వ వార్డు సంతపాలెంలో మహిళకు కరపత్రం అందిస్తున్న మొల్లి అప్పారావు, నాయకులు

ఆరిలోవ : కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆరోపించారు. జీవీఎంసీ 10, 12 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో చేపట్టిన కార్యక్రమాల్లో అప్పారావు పాల్గొని స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. కూటమి పాలనా వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. కూటమి ప్రభుత్వం పాలనలో జరుగుతున్న అరాచకాలు, మోసాలు తెలియజేశారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన పలు సంక్షేమ పథకాలు, అవి ఏవిధంగా ప్రజలకు ఉపయోగపడ్డాయో వివరించారు. పదో వార్డు పరిధి శాంతినగర్, బి.ఎస్.ఆర్.నగర్‌లో, పన్నెండో వార్డులోని సంతపాలెంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో అప్పారావు మాట్లాడుతూ సాధారణ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అధికారం చేపట్టిన తర్వాత గాలికి వదిలేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కరోనా సమయంలో సైతం ఆరోగ్యశ్రీ పథకాన్ని పక్కాగా అమలు చేశామని గుర్తు చేశారు. ఇంటింటికీ టెలీ మెడిసిన్ అందుబాటులో ఉంచామన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం గద్దెనెక్కినప్పటి నుంచి నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకుండా వదిలేశారని ఆరోపించారు. పేదవారికి ఆరోగ్యశ్రీ పథకాన్ని దూరం చేసే కుట్ర పన్నుతున్నారన్నారు. అందుకే నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు ఇవ్వడం లేదని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పదో వార్డు అధ్యక్షుడు పతివాడ కనకరాజు, జిల్లా కార్యదర్శి బొండా శ్రీనివాస్, కిలపర్తి గోవింద్, పతివాడ వెంకటలక్ష్మి, సాయి, బి.టి.నాయుడు, చింతా శ్రీను, సూరి, మడక కుమారి, సత్యవతి, జయశ్రీ, శ్రీదేవి, పద్మ తదితరులు పాల్గొన్నారు. పన్నెండో వార్డు సంతపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకులు మొల్లి హేమంత్, బుజ్జి మురళి, బంధం శ్రీను, జేమ్స్, సత్యనారాయణ, మొల్లి అప్పలరాజు, అర్జున్, వరహాలు, కుమార్, శంకర్, సన్యాసమ్మ, జయమ్మ, పద్మ, కల్యాణి, సుందరమ్మ, ప్రశాంతి, మణి, కొండమ్మ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లందరికీ వాహన మిత్ర అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పడాల గోవింద్

మద్దిలపాలెం : ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్లు అందరికీ షరతులు లేకుండా వాహనమిత్ర పథకం అమలు చేసి ఖాతాల్లో రూ.15 వేలు చొప్పున జమ చేయాలని ఆటో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ డిమాండ్ చేశారు. మద్దిలపాలెం కృష్ణ కాలేజీ రోడ్‌లో గల ఏఐటీయూసీ కార్యాలయంలో ఆటో డ్రైవర్ల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ప్రమాదకరంగా మారిన జీవోలు 21, 31 రద్దు చేయాలని కోరారు. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తెచ్చి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ఈ నెల 18న జరిగే అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా పాలసీ అమలు చేసి డ్రైవర్ల కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు. సమావేశంలో వాసు, లోవరాజు, నాగు శ్రీను, శివ పాల్గొన్నారు.

వీవోఏలకు జీతాలు చెల్లించకపోవడం దారుణం

- సమస్యలు పరిష్కరించాలని డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట నిరసన



డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వీవోఏలు, తదితరులు

ఎంవీపీ కాలనీ : విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వీవోఏలు నిరసనకు దిగారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఎంవీపీ కాలనీలోని డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ వీవోఏల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. 3 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌తో ఉద్యోగులను వేధిస్తోందన్నారు. వేతనాల పెంపు కోసం పెద్ద ఎత్తున విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. పైగా కొత్త సెల్‌ఫోన్లు అందించకుండా పాత వాటితోనే 26 రకాల యాప్ వర్కులు చేయాలని ఒత్తిడికి గురి చేస్తోందన్నారు. ఇప్పటికైనా వీవోఏల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించాలన్నారు. వేతనాలు పెంచడంతోపాటు కొత్త ఫోన్లు అందించాలని, ఆర్పీలు మాదిరిగానే 3 ఏళ్ల కాల పరిమితి జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 24న జరిగే రాష్ట్ర స్థాయి సమావేశంలోపు సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు అపర్ణ హెచ్చరించారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతికి సమస్యల పరిష్కారంపై వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు మణి, కంచమ్మ, శ్రీలక్ష్మి, పార్వతి, శారద, శ్యామల, వెంకటలక్ష్మి, గౌరి పాల్గొన్నారు.

యువతరం జ్ఞానాన్వేషణతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న రెక్టార్ ఆచార్య కిషోర్‌బాబు

మద్దిలపాలెం : నిరంతరం జ్ఞానాన్వేషణతో యువతరం ముందుకు సాగాలని ఏయూ రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు సూచించారు. ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల సాంకేతిక సమ్మేళనం యాక్సెస్ 2కె 25 ముగింపు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర ప్రగతి, నూతన ఆవిష్కరణలు తెలుసుకోవడానికి, నిపుణుల సూచనలు పొందడానికి ఇటువంటి సదస్సులు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ఐఐటీ కాన్పూర్ విశ్రాంత ఆచార్యులు ఎం.ఆర్.మాధవ్, రాకీరా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ కేఎస్ఆర్ ప్రసాద్, స్టైస్టా సిస్టమ్స్ గ్లోబల్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో బి.వి.నాగరాజ్ కుమార్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వాల్యూవర్స్ విశాఖపట్నం కేంద్రం చైర్మన్ డేవిడ్ మక్వన్ మాట్లాడారు. విద్యార్థులు ఉత్సాహంగా తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. ఆచార్య పి.వి.వి.సత్యనారాయణ, ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావు, ఆచార్య ఎస్.యజ్ఞని, ఆచార్య టి.వి.ప్రవీణ్, ఆచార్య కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు

21న ప్రపంచ శాంతి దినోత్సవం

ఎంవీపీ కాలనీ : నగరంలోని ఎల్‌బీ కళాశాలలో ప్రపంచ శాంతి దినోత్సవం ఈ నెల 21న నిర్వహించనున్నట్లు ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థ తెలిపింది. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు మంగళవారం ఎంవీపీ కాలనీలో జరిగిన కార్యక్రమంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రపంచశాంతి స్థాపనపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రతిజ్ఞ చేయించనున్నట్లు తెలిపారు. ప్రపంచ శాంతి స్థాపనకు యూఎన్ఓ కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జగదీశ్వరరావు, డాక్టర్ అప్పారావు, డాక్టర్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

టూరిజం హబ్‌గా తీర్చిదిద్దండి

ఏయూ క్యాంపస్ : టూరిజం హబ్‌గా విశాఖ నగరాన్ని తీర్చిదిద్దడంలో సహకారం అందించాలని హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (హెచ్‌ఆర్‌ఏఏపీ) అధ్యక్షుడు పవన్ కార్తీక్ కోరారు. నగరంలోని ఓ హోటల్‌లో భారత పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ (సౌత్) వెంకటేషన్ దత్తరేయన్‌తో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశాఖను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా పర్యాటకుల సంఖ్యను పెంచడం, ఉద్యోగులకు శిక్షణ, నైపుణ్య అభివృద్ధికి వర్క్‌షాప్‌లు నిర్వహించాలని, హోటల్ – ట్రావెల్ ట్రేడ్ బృందాలతో రోడ్ షోలు నిర్వహించాలని ప్రతిపాదించారు. సమిష్టిగా పనిచేస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా విశాఖను తీర్చిదిద్దడం సాధ్యపడుతుందని వివరించారు. హెచ్‌ఆర్‌ఏఏపీ కార్యదర్శి జయదీప్ బిస్వాస్, ఏపీ ట్రావెల్ అండ్ టూరిజం అసోసియేషన్ వైజాగ్ చాప్టర్ ప్రతినిధి పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లలితాపీఠంలో 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తదితరులు

సీతంపేట: స్థానిక అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ వరకు దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం పీఠం దర్బారు హాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న ఉదయం 8:30 గంటలకు అమ్మవారి సన్నిధిలో కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభిస్తామని తెలిపారు. లక్ష్మీ గణపతి హోమం, చండీ హోమం నిర్వహిస్తామన్నారు. 23న శ్రీసుబ్రహ్మణ్యస్వామి, సర్పసూక్త హోమం, మన్యు పాశుపత హోమం, 24న శ్రీప్రత్యంగిర భద్రకాళి హోమం, 25న దత్తాత్రేయ దక్షిణామూర్తి హోమం, 26న లలితాదేవి హోమం, మహాలక్ష్మి షడక్షరి, ఖడ్గ మాల హోమం, 27న వారాహిదేవి హోమం, రాజ శ్యామల హోమం, 28న మహా సౌర అరుణహోమం, 29న సరస్వతి దేవి, గాయత్రి దేవి హోమం, 30న కాళీహోమం, బగళాముఖి హోమం, అక్టోబరు 1న ఉదయం 10 గంటలకు వనదుర్గా, శ్రీవిద్యా హోమం, 2న దశమి రోజున 108 ద్రవ్యాలతో మహా పూర్ణాహుతి, చండీహోమం, లఘు పూర్ణాహుతి నిర్వహిస్తామని తెలిపారు. రోజూ ఉదయం చండీ పారాయణ, సాయంత్రం 3:30 గంటలకు చండీ హోమం, సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తామని తెలిపారు.

ఓజోన్ పొర సంరక్షణ అందరి బాధ్యత



తీర్చిదిద్దిన పోస్టర్లతో విద్యార్థులు

ఏయూ క్యాంపస్ : ఓజోన్ పొర పరిరక్షణ మనందరి బాధ్యత అని జీవీపీ ఎం.ఎల్.బి.టి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ కె.మధురవాణి అన్నారు. ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీచ్‌రోడ్డులోని పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి చిన్నారులకు ఓజోన్ పొర ఆవశ్యకతను వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కర్బన ఉద్గారాలను తగ్గించడం, మొక్కలను విరివిగా పెంచడం, కాలుష్యాన్ని నియంత్రిండం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం ఎంతో ప్రధానమన్నారు. ఓజోన్ పొర క్షీణత పర్యావరణం, పంటలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ప్రత్యక్షంగా మానవులపై సైతం ప్రభావం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓజోన్ పొర ఆవశ్యకతను వివరిస్తూ తీర్చిదిద్దిన పోస్టర్లను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు నాటడం, భూగర్భ జలాల వినియోగం, ఉష్ణోగ్రతలు పెరగడం తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.